

ఇసుక తోడేళ్లు

పర్లాం వద్ద ఇసుక తవ్వుకుపోతున్నారు. రాత్రిళ్లు అక్రమంగా తరలిస్తున్నారు.

- 8లో



దాతలే దయచూపాలి

రెండు కిడ్నీలు పాడైపోయి ఓ యువకుడు ఇబ్బంది పడుతున్నాడు. దాతల సాయం కోరుతున్నాడు.

- 8లో

వైఎస్సార్ సీపీ మద్దతు డీలర్లపై కొరడా

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్ సీపీకి మద్దతుదారులైన పలువురు డీలర్లపై ప్రభుత్వం టార్గెట్ పెట్టింది. కొఠారీ పంచాయతీ నుంచి ఓ టీడీపీ లీడర్ ఫిర్యాదు మేరకు రెండు రోజుల కిందట రేషన్ షాపుపై దాడులు చేసిన అధికారులు ఆన్‌లైన్ స్టాక్‌లో తేడాలు ఉన్నాయంటూ వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు రేషన్ డీలర్ లక్కోజీ కృష్ణారావును డీలర్‌షిప్ నుంచి తీసేశారు. అదే విధంగా డాసన్నపేటలోని డిపో నంబర్ 224, గొల్లవీధిలోని డిపో నంబర్ 225పై దాడులు చేశారు.

న్యూస్‌రీల్

'మత్స్యకార భరోసా నిధులు విడుదల చేయాలి'

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటింది. వేట నిషేధ కాలంలో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వరుస అల్పపీడనం, వాయుగుండాలు, వానల వల్ల మత్స్యకారులు వేట లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో మత్స్యకారులకు ఆసరా లేకుండా పోతోంది. రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మత్స్యకారులను ఆదుకోవాలని జిల్లా టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోవిందు పాపారావు కోరారు. ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మత్స్యకారులకు మత్స్యకార భరోసా ఇచ్చి ఈ సమయంలో ఆదుకుంటే వారికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

'మీ కోసం'లో 200 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి 200 వినతులు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, జెడ్పీ సీఈఓ జిల్లా పరిషత్ వెంకటేశ్వర రావు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రద్ధ, అంకిత భావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని అన్నారు. పనిచేద్దాం-లక్ష్యాలు సాధిద్దాం అని పిలుపునిచ్చారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు



గ్రీవెన్స్ బయట వృద్ధుడు, మహిళల గోడు వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సకాలంలో బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

'1వ తేదీనే వందశాతం పింఛన్లు ఇవ్వాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 1వ తేదీనే వందశాతం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ ఉదయం 5.30 గంటలకు పంపిణీ ప్రారంభించి మొదటి రోజునే వంద శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. సచివాలయ అన్ని శాఖల సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.

కేజీబీవీకి కరిగిన గుడ్లు సరఫరా



కోటబొమ్మాళి కేజీబీవీకి సోమవారం సరఫరా చేసిన కరిగినపోయిన గుడ్లు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ విద్యాలయానికి సోమవారం కరిగిపోయిన గుడ్లను డమ్మీ వెండర్ సరఫరా చేశారు. దీంతో సిబ్బందికి, సరఫరా చేసే వ్యక్తికి వాదోపవాదాలు జరిగినట్లు తెలుస్తోంది. తరచూ కరిగిపోయినవి, పగిలిన గుడ్లను సరఫరా చేస్తుండటంతో అవి తింటున్న విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవలే ఈ కేజీబీవీలో 22 మంది విద్యార్థినులు ఒకే రోజున డయేరియా బారిన పడ్డారు. ప్రభుత్వం నియమించిన వెండర్ కాకుండా స్థానికంగా ఉన్న ఒక వ్యక్తి డమ్మీ వెండర్‌గా ఉంటూ గుడ్లు సరఫరా చేయిస్తున్నాడు. అతను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు కరిగినవి, పగిలినవి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతిని వివరణ కోరగా అసలు వెండర్ ఎవరో తనకు తెలియదని, స్థానిక ప్రైవేటు వ్యక్తి గుడ్లను తెచ్చి ఇస్తున్నారని, అందుకే కరిగిన గుడ్లను తిరస్కరిస్తున్నామని చెప్పారు.

ఏమిటీ 'పచ్చ'పాతం..

- సచివాలయాన్ని అన్నా క్యాంటీన్‌గా మార్చుతున్న వైనం



నిన్న సచివాలయం



నేడు అన్నా క్యాంటీన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పౌర సేవల కోవెల్లగా ఐదేళ్ల పాటు సచివాలయాలు విరాజిల్లాయి. కానీ కూటమి ప్రభుత్వం సచివాలయ ప్రాధాన్యాన్ని తగ్గించాలని చూస్తోంది. శ్రీకాకుళం నగరంలో పాతబస్టాండ్ సమీపంలో పొట్టి శ్రీరాములు కూడలి వద్ద దమ్మలవీధి, (40వ డివిజన్), చంపాగల్లవీధి (15వ డివిజన్) కి చెందిన సచివాలయాన్ని అన్నా క్యాంటీన్‌గా మార్చుచేసేందుకు బోర్డులు మార్చేసి, రంగులు పూసి తమ పచ్చపాతాన్ని చూపిస్తున్నారు. దీంతో సచివాలయ కార్యకలాపాలు పూర్తిగా నిలుపుదల చేశారు. ఈ సచివాలయానికి చెందిన ఉద్యోగులంతా నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూర్చోడానికి కుర్చీ లేక, పనిచేయడానికి కంప్యూటర్ లేక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. అక్కడ సచివాలయాన్ని ఏర్పాటు చేసుకునేందుకు భవనాన్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఖాళీగా ఉన్న సచివాలయ ఉద్యోగులకే అప్పగించడం గమనార్హం.

నిప్పు రాజుకుంది

- గార ఎస్‌బీఐ బంగారం మాయం కేసులో ఎస్బీఐ మాజీ రీజనల్ మేనేజర్ రాజుపైనే అనుమానాలు
- జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన బాధితులు
- బంగారం మాయం కేసులో ఆత్మహత్య చేసుకున్న స్వప్నప్రియ తల్లి ఫిర్యాదు



సాక్షిలో ప్రచురితమైన కథనాలు

బిడ్డను పోగొట్టుకున్న తల్లి పెద్ద వ్యవస్థతో పోరాడుతోంది. తన బిడ్డకు జరిగిన అన్యాయాన్ని సమాజానికి తెలియజేయాలనుకుంటోంది. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆడబిడ్డ అర్థాంతరంగా తనువు చాలించడంతో తట్టుకోలేకపోతోంది. బాధ్యులకు శిక్ష పడాలని ఒంటరి పోరాటం చేస్తోంది. స్థానికంగా న్యాయం జరగలేదని ఏకంగా జాతీయ మానవ హక్కువల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించి తన గోడును వెళ్లబోసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో అత్యున్నతమైనదిగా భావిస్తున్న ఎస్‌బీఐలో జరుగుతున్న అక్రమాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లింది. బాధ్యులెవరో సూచన ప్రాయంగా తెలియజేసింది. అందులో మాజీ ఆర్ఎం రాజుపైనే ఆరోపణలను సంధించింది. జిల్లాలో సంచలనం సృష్టించిన గార ఎస్‌బీఐలో తాకట్టు నగలు మాయం ఘటనలో కొంత కాలంగా జరిగిన పరిణామాలు చూస్తుంటే మాజీ ఆర్ఎం రాజు వైపే అన్ని వేళ్లూ చూపిస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎస్‌బీఐ మాజీ రీజనల్ మేనేజర్ రాజుపై ఉచ్చు బిగుసుకుంటోంది. గత ఏడాది నవంబరులో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గార ఎస్బీఐలో తనఖా బంగారం మాయం కేసులో అతడిపైనే ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఉదంతంలో ఆత్మహత్యకు పాల్పడిన బ్యాంకు ఉద్యోగిని ఉరిటి స్వప్నప్రియ తల్లి సరళ జాతీయ మానవహక్కుల కమిషన్, మహిళాకమిషన్లను ఆశ్రయించడం, అప్పటి ఎస్బీఐ జిల్లా రీజనల్ మేనేజర్ తోటకూర రమణమూర్తి రాజుపై ఈ నెల 13న ఫిర్యాదు చేయడంతో కుంభకోణం వెనుక అసలు సూత్రధారి రాజే అంటూ వేళ్లన్నీ అతని వైపే చూపిస్తున్నాయి.

గత ఆర్ఎం నిర్వాకంతోనే..

2022లో ఉరిటి స్వప్నప్రియ క్లర్క్‌గా/అకౌంటెంట్‌గా గార ఎస్బీఐలో చేరింది. 2023 నవంబరు 20న మేండేటరీ లీవ్ పెట్టింది. అంతకుముందు రోజు అంటే నవంబరు 19న వేరే వ్యక్తికి డ్యూటీ చార్జి అప్పగించింది. నవంబరు 24న బ్రాంచిలో తనఖా బంగారం మాయమైనట్లు వెలుగులోకి వచ్చింది. అంతకుముందు రోజే (23న) స్వప్నప్రియతో పాటు జాయింట్ కస్టోడియన్‌గా ఉన్న క్యాషియర్ ముంజి సురేష్ అనే వ్యక్తి తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని, నగలు కాజేసి విషయం బయటకు ఎక్కడ పొక్కుతుందోనని స్వప్నప్రియే తనపై దాడి చేయించినట్లు రూరల్ పీఎస్‌లో తప్పుడు కేసు పెట్టారు. సెలవులో ఉన్న స్వప్నప్రియకు బ్యాంకు అసోసియేషన్ ప్రతినిధుల ద్వారా ఆ విషయం తెలిసింది. అంతేకాక ఆమెపైనే ఆరోపణలు వచ్చినట్లు కూడా చెప్పడం, అప్పటికే కొన్ని పత్రికల్లో, సోషల్ మీడియాలో పథకం ప్రకారం స్వప్నప్రియే కాజేసినట్లు కథనాలు వచ్చాయి. రీజనల్ మేనేజర్ రాజు తనకు సన్నిహితంగా ఉన్న కొంతమంది సిబ్బందితో కలసి పత్రికల్లో, సోషల్ మీడియాలో పథకం ప్రకారం రాయించారని ఆరోపణలున్నాయి. మళ్లీ ఏమీ ఎరగనట్లు 2023 నవంబరు 26న ఆర్ఎం రాజు స్వప్నప్రియను బ్రాంచిలో సమావేశమని పిలిచి, అందరం కలిసి డబ్బులు వేసుకుని బంగారాన్ని విడిపిద్దామని చెప్పడంతో అప్పటికే పత్రికల్లో అసభ్య రాతలు, సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లతో కుంగిపోయి ఉన్న స్వప్నప్రియ ఇంకా పరువు పోకూడదనే ఉద్దేశంతో తన కుటుంబ సభ్యులకు చెప్పి తన వంతుగా రూ.కోటిన్నరకు పైగా అప్పులు చేసి, ఆస్తులు అమ్మి, బంగారం తనఖా పెట్టి మరీ డబ్బు ఏర్పాటు చేసింది. కొంత గోల్డ్ వ్యవహారం అంతర్గతంగా క్లియర్ అయ్యాక 2023 నవంబరు 28న ఆర్ఎం రాజు కొన్ని పత్రికల్లో గార బ్యాంకులో బంగారం పోలేదంటూ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఇదంతా తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి చేసిన యత్నంగా స్వప్నప్రియ తల్లి జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు చేసిన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇంట్లో సొమ్ము కట్టి నప్పటికీ తర్వాత అన్ని నేరాల్లో తననే బాధ్యురాలిగా చేయడం, పత్రికలు, సోషల్‌మీడియా కథనాలు, కుటుంబం తన వల్ల అప్పులు చేయడంతో మనస్తాపానికి గురైన స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుంది.



గార ఎస్‌బీఐ వద్ద ఖాతాదారుల ఆందోళన (ఫైల్)

నరసన్నపేట బ్రాంచిలో..

రాజు హయాంలోనే నరసన్నపేట బ్రాంచిలో వ్యక్తిగత రుణాల పేరుతో రూ. 3 కోట్ల కు పైగా స్కామ్ జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. స్కామ్ జరిగిందన్న ఆరోపణలున్న బ్రాంచి మేనేజర్‌ను కూడా ఆకస్మికంగా తర్వాత బదిలీ చేసేశారు. అప్పట్లో విచారించిన ఎస్బీఐ ఉన్నతాధికారులు ఆర్ఎం రాజుపై బదిలీ వేటు వేసి విచారణకు ఆదేశించారు. విశాఖ ఏ కాలనీ బ్రాంచిలో పనిచేసిన ఓ మహిళా ఉద్యోగితో నెరిపిన సంబంధాలపై ఎస్బీఐ విశాఖ ఏజీఎం చేత విచారణ జరిపించారు. కాశీబుగ్గ కేటీ రోడ్డు, హరిపురం, నౌపడ బ్రాంచిల్లోనూ ఆయనపై ఆరోపణలున్నాయి.

కావాలనే ఇరికించారు..



పథకం ప్రకారమే మా అమ్మాయి వ్యక్తిగత జీవితం మీద ఆరోపణలు చేసి సోషల్ మీడియాలో, కొన్ని పత్రికల్లో ప్రచారం చేశారు. దీంతో తను మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి ప్రధాన కారణం వెనకుండి నడిపించిన అప్పటి రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజు, అతని అనుచరులు. ఇప్పటికే అతనిపై మహిళా కమిషన్‌కు, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాను. ఎంతవరకైనా పోరాడతాను. - ఉరిటి సరళ, స్వప్నప్రియ తల్లి

ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు..

- ఆర్ఎం రాజు ముందుగా 2023 నవంబరు 19న స్వప్నప్రియను సస్పెండ్ చేశామని చెప్పారు. అదే నవంబరు 20న మేడేంటరీ లీవ్ ఎలా మంజూరు చేశారు. స్వప్నప్రియ కుటుంబీకులు నిలదీయడంతో నవంబరు మళ్లీ 24న సస్పెండ్ చేసినట్లు ఆర్ఎం చెప్పడం విశేషం.
- ఒక వేళ 2023 నవంబరు 24న సస్పెండ్ చేస్తే 28న బ్రాంచిలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఎలాంటి బంగారం పోలేదని, అన్నీ వదంతులేనని ఎందుకు ఆర్ఎం చెప్పినట్లు.?
- గార పోలీసులకిచ్చిన ఫిర్యాదులో తనకేమీ తెలియదని చెప్పిన ఆర్ఎం రాజు మారు తనఖా పెట్టిన ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలకు 2023 నవంబరు 27, 28 తేదీల్లో స్వప్నప్రియ సోదరునితో కలిసి ఎందుకు వెళ్లినట్లు..? (అది అక్కడి సీసీ ఫుటేజీలో కూడా నిక్షిప్తమైంది.)
- స్వప్నప్రియ బతికి ఉన్నప్పుడు అసలేం జరగలేదని చెప్పిన ఆర్ఎం ఆమె చనిపోయాక ఏ-1 ముద్దాయిగా ఎలా ఫిర్యాదులో చేర్చారు. బ్యాంకు చెస్ట్ కస్టోడియన్లు ఇద్దరూ ఒకేసారి సెలవు పెడితే బీఎం దగ్గర ఒక కీ ఉంటుంది. వేరే వ్యక్తిని కస్టోడియన్‌గా పెట్టి తాళం చెవి ఇస్తారు. కానీ ఆ వేరే వ్యక్తి గానీ, మేనేజరు పేరుగాని ఎందుకు ప్రస్తావించలేదని ఉరిటి సరళ.. జాతీయ మహిళా, మానవ హక్కుల కమిషన్లకు ఇచ్చిన ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు.



● ముఖలింగేశ్వరా..

అందరికిస్తావు మోక్షం

నీకు లేదా ప్రాప్తం!

- శ్రీముఖలింగంలో నానాటికీ తీసికట్టుగా పరిస్థితి
- కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న నిర్వహణ లోపం
- పురావస్తు శాఖ అధికారులు దృష్టి సారించాలని భక్తుల విన్నపం

జలుమూరు: కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖ దర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని ప్రతీతి. ముఖలింగంలో స్వామిని దర్శించుకున్న వారికి మోక్షమేమో గానీ క్షేత్రానికి మాత్రం మోక్షం రావడం లేదు. దశాబ్దాలుగా నిర్వహణ లోపంతో క్షేత్రం కునారిల్లిపోతోంది. ఈ పురాతన ఆలయం పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉంది. చాలా విశిష్టమైన నిర్మాణం కావడంతో.. ఇక్కడ చేయాల్సిన ప్రతి పనినీ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మాత్రమే చాలా జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. కానీ ఆ శ్రద్ధ కనిపించకపోవడంతో భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. చోళుల కాలం 8 వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ, విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. కార్తీక మాసం, శివరాత్రి ఉత్సవాలకు దేశం నలుమూలలు నుంచి సుమారు మూడు లక్షలు వరకూ భక్తులు స్వామిని దర్శించుకుంటారు. ఆలయాన్ని శ్రద్ధగా పరిశీలించి లోపాలు సరిచేస్తే క్షేత్రం మరింత విశిష్టంగా పరిఢవిల్లుతుందని భక్తులు కోరుతున్నారు.



ప్రత్యేకతలు ఎన్నో

- ఇక్కడ ముఖలింగాలయాన్ని మధుకేశ్వరాలయం అని కూడా అంటారు.
- ఇక్కడ లింగం రాతితో చెక్కింది కాదు. ఇప్ప చెట్టు మొదలును నరికి వేయగా అదే ముఖలింగంగా ప్రసిద్ధి చెందింది. ఇప్పచెట్టును సంస్కృతంలో 'మధుకం' అంటారని అందువల్ల ఈ స్వామికి మధుకేశ్వరస్వామి ఆలయంగా పేరొచ్చిందని అంటారు.
- ముఖలింగంలోని దేవాయాలు 8-11 శతాబ్దాల మధ్య కాలంలో నిర్మించారు. వాటిలో చివరిదైన సోమేశ్వరాలయం 11 వ శతాబ్దం నాటిది.
- ఇక్కడి శిల్ప కళ అంతా ఒడిశా రీతిని పోలి ఉంటుంది.
- సోమేశ్వరాలయానికి గర్భగుడి మాత్రమే ఉంది. ముఖమండపం ఉండదు. ఎత్తయిన శిఖరంపై రాతితో కప్పు వేశారు. పిడుగు పడి రాయి ముక్క కింద పడగా.. యాభై మంది కలిపి ఎత్తలేకపోయారని అంటారు.

చేయాల్సిన పనులు..



ప్రధాన ఆలయంలో గోతులుగా మారి నీరు నిల్వ ఉన్న గర్భగుడి

- వానలు పడినప్పుడల్లా గర్భగుడి లోపల నీరు చేరుతోంది.
- మధుకేశ్వరుని పానమట్టం గోతులుగా మారి పూజాది ద్రవ్యాలు, పంచామృతాలు నిల్వ ఉండి పోతున్నాయి.
- ప్రధాన ఆలయం గర్భగుడిలో ఫ్లోరింగ్ బీటలు వారి పూజా సామగ్రి నిల్వ ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.
- ప్రధాన ఆలయంలో నిత్యాభిషేకాలు, ఏకవార అభిషేకాలు అనంతరం బయటకు చండీశ్వరుడి మీదుగా వారాహి అమ్మవారి పక్క నుంచి వెళ్లే తీర్థం వంశధారకు అనుసంధానం చేశారు. కానీ నిర్వహణ సరిగా లేక ఆలయ దేవతా విగ్రహాలకు పూజలు చేసే సమయంలో భరించరాని దుర్గంధంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- ఇదే చోట ఏర్పాటు చేసిన ట్యాంక్ కూడా వ్యర్థాలతో నిండిపోవడంతో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు.
- ఆలయం లోపల రాతి పలకల మధ్య ఖాళీలు ఏర్పడడంతో వాటి మధ్య నీరు, ఇతర వ్యర్థాల వల్ల పూజలు చేసేందుకు కూడా భక్తులు ఇబ్బంది పడుతున్నారు.
- గర్భగుడి లోపల గోలెం నుంచి ఇటు నిత్య దీపారాధన వరకూ భక్తులు ఉండేందుకు కూడా అవకాశం లేదు.
- శివరాత్రి, కార్తీక మాసాల్లో అభిషేకాలకు ఇబ్బంది తప్పడం లేదు.
- అష్ట దిక్పాలకులైన ఇంద్రేశ్వరుడు, వాయువేశ్వరుడు, అగ్నీశ్వరుడు, వరుణేశ్వరుడు, నైరుతేశ్వరుడు, యమేశ్వరుడు, కుబేరేశ్వరుడు, ఈశాన్యేశ్వరుడు ప్రతిష్ఠించిన శివలింగాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి.
- కుబేరుడు మినహా అన్ని శివలింగాల పానమట్టాలు శిథిలమైపోవడంతో పాలు, కొబ్బరి నీరు, పంచామృతాలతోపాటు ఇతర పూజా వస్తువు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది.

మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం

ముఖలింగంలో ప్రధాన ఆలయం, గర్భగుడిలో పలు సమస్యలు గుర్తించాం. లోపల భాగం అంతా అస్తవ్యస్తంగా ఉంది. ఇటీవలే కేంద్రపురావస్తు శాఖ ఇంజినీరుతో పరిశీలించి నివేదిక సిద్ధం చేశాం. ఇప్పుడు వానాకాలం కాబట్టి.. త్వరలోనే పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - నవీన్, కన్జర్వేటివ్ అసిస్టెంట్, కేంద్రపురావస్తు శాఖ, విశాఖపట్నం

పానమట్టాలు బాగు చేయాలి




ప్రధాన ఆలయంతోపాటు అష్ట దిక్పాలకులైన దేవేంద్ర, వరుణ, వాయువు, అగ్ని తదితర దేవతలు ప్రతిష్ఠించిన శివలింగాల పానమట్టాలు బాగు చేయాలి. కేంద్ర పురావస్తు శాఖ చొరవ తీసుకోవాలి. - వి.శ్రీరామ్ ప్రసాద్, భక్తుడు, మచిలీపట్నం

ఆశ పడ్డాం..

మోసపోయాం



- కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ సీట్లంటూ నమ్మించాడు
- రూ.2.09కోట్లు తీసుకుని మోసం చేశాడు
- ఎస్పీ వద్ద మొరపెట్టుకున్న బాధితులు




శ్రీకాకుళం క్రైమ్ : 'పిల్లల భవిష్యత్ బాగు పడుతుందని ఆశపడ్డాం.. విదేశాల్లో ఎంబీబీఎస్ సీట్లంటే మురిసిపోయాం. ఆరేళ్ల ఫీజు ఒకేసారి కట్టాలంటే డబ్బులన్నీ ఇచ్చేసి మోసపోయాం' అంటూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థుల తండ్రులు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వద్ద సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పోలీ సు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థుల తండ్రులు ఐదుగురు, విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థుల తండ్రులు ఎస్పీకి ఈ మేరకు ఫి ర్యాదు చేశారు. తామంతా కలిసి తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్‌కు రూ. 2.095 కోట్లను బ్యాంకు ఖాతాల ద్వారా, నగదు రూపేణా వేసి మోసపోయినట్లు చెప్పారు. వారు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు..

కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీప యాతపేటలో జీబీఎస్ ఇంటర్నేషనల్ లార్జెస్ట్ అండ్ లీడింగ్ కన్సల్టెన్సీని 2022లో ప్రారంభించాడు. కజకిస్తాన్‌లోని ఓ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని దానికి రూ. లక్షల్లో సొమ్ము కట్టాల్సి ఉంటుందని ఒక్కో విద్యార్థి వద్ద ఒక్కోలాగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. సీటు, వసతికి సంబంధించి ఆరేళ్ల ఫీజు ఒకేసారి కట్టాలని హరీష్ గంగాధర్ విద్యార్థులకు చెప్పడంతో ఈ విషయాన్ని తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లాకు చెందిన పొందర సాంబమూర్తి (పోలాకి మండలం గాతలవలస) రూ. 32.50 లక్షలు, బోర అప్పాజి (పోలాకి మండలం చల్లయ్యవలస) రూ. 28.50 లక్షలు, దుప్పల దుర్గారావు (కుశాలపురం) తమ ఇద్దరు కుమారులకు రూ. 45 లక్షలు, పైడి అప్పలసూర్యనారాయణ (కుశాలపురం) రూ. 25 లక్షలు, అన్నెపు నానాజీరావు (శ్రీకాకుళం), రూ. 25 లక్షలు కట్టగా, విజయనగరం జిల్లాకు చెందిన ఓన రమణ (రాజాం, కొత్తవలస) 28.50లక్షలు, కొర్నాన అప్పలనాయుడు (బొండపల్లి మండలం రోళ్లవాక) రూ. 25 లక్షలు ముట్టజెప్పారు.

ఒక్క ఏడాదికే..


ఏడాది కిందట ఎనిమిది మంది విద్యార్థులను కజికిస్తాన్‌లో మెడికల్ యూనివర్సిటీ వారు ఫీజులు చెల్లించలేదంటూ హాస్టల్, కళాశాలల నుంచి పంపించేశారు. దీంతో హరీష్ అసలు బాగోతం బయటపడింది. తాము ఆరేళ్లకు చెందిన ఫీజును చెల్లించినా.. హరీష్ మాత్రం ఒక్క ఏడాదికే కళాశాల, వసతి, మెస్ ఫీజులు చెల్లించినట్లు విద్యార్థులు తెలుసుకుని తాము మోసపోయామని గ్రహించారు. దీంతో వెంటనే అతడిని నిలదీయగా.. బెదిరించడంతో పాటు దాడులకు కూడా పాల్పడ్డాడు. దీంతో వారంతా ఇంటి వద్ద విషయం చెప్పి స్వదేశానికి వచ్చేశారు. ఈ విషయమై ఇండియన్ ఎంబసీలో ఈ ఏడాది మార్చిలో విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

మోసపోయాం..



మాది వ్యవసాయ కుటుంబం. కొడుకును డాక్టర్‌గా చూడాలన్నది నా కోరిక. కొంతమంది ద్వారా పరిచయమైన హరీష్ గంగాధర్ ఇండియాలో మెడిసిన్ సీటుకు ఎక్కువవుతుందని, కజకిస్తాన్‌లో తక్కువతో పనవుతుందని చెప్పి రూ.లక్షల్లో డబ్బు కట్టించుకుని మోసం చేశాడు. ఎస్పీగారైనా న్యాయం చేస్తారని వచ్చాం. - కొర్నాన అప్పలనాయుడు, రోళ్లవాక, బొండపల్లి మండలం, విజయనగరం

అప్పే మిగిలింది..



నా ఇద్దరు కుమారుల భవిష్యత్ బాగుంటుందని ఆశపడి హరీష్‌కు రూ. 45 లక్షలు కట్టేశాను. ఏడాది ఫీజు మాత్రమే కట్టి మిగతా ఏడాదికి కట్టకపోవడంతో నిలదీస్తే.. కజకిస్తాన్‌లో పిల్లలపై దాడికి పాల్పడ్డాడు. దాడిపై అక్కడి పోలీసులకు, ఇండియన్ ఎంబసీకి ఫిర్యాదు చేశాం. మా పిల్లలతో పాటు మిగతావారిపట్లా ఇదే తీరున వ్యవహరించాడు. పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయాం. - దుప్పల దుర్గారావు, కుశాలపురం

బంగాళాదుంప @ రూ.50

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గత కొంతకాలంగా కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా బంగాళాదుంపల ధరలు ఏకంగా రైతు బజార్‌లో రూ.50కి చేరడంతో జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో అయితే కొన్నిచోట్ల రూ.60, మరికొన్ని ప్రాంతాల్లో రూ.70కి అమ్ముతున్నారు. జిల్లాకు ఎక్కువగా వెస్ట్ బెంగాల్ నుంచి బంగాళాదుంపలు దిగుమతి అవుతాయి. ఇటీవల సరఫరా నిలిపివేయడంతో ధర పెరిగిందని చెబుతున్నారు. ఉల్లి, టమాటాలతోనే వేగలేకపోతుంటే ఇప్పుడు బంగాళాదుంపల ధరలు కూడా పెరుగుతుండడం సామాన్యులకు తలనొప్పిగా మారింది.



క్లుప్తంగా

రూ.2లక్షల ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ మైత్రీ కాలనీకి చెందిన గొండు రమేష్ గత నెలలో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి పలువురు ముందుకు వచ్చారు. మృతుడి స్నేహితులు అంతా కలిసి రూ.1,72,500లు, హెల్పింగ్ హేండ్స్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పి.శ్రీధర్ రూ.10వేలు, హిరమండలం అందవరపు వీధి, కోట్ని వీధికి చెందిన పలువురు మహిళలు రూ.27200లు మెత్తం రూ.2,09,700లు ఆర్థిక సాయాన్ని మృతుడి భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఈ మొత్తాన్ని మృతుడి పిల్లల పేరున బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టి.శివ, ఎ.నారాయణ, డి.శేఖర్, తదితరులు ఉన్నారు.

సోనూసూద్‌కు 'సైకత' జన్మదిన శుభాకాంక్షలు



సోనూసూద్ సైకత శిల్పం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కంపోస్టు కాలనీకి చెందిన ఆర్టిస్టు లాల్ ప్రసాద్ దాకోజు సోనూసూద్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం సైకత శిల్పం తయారుచేశారు. కల్లేపల్లి బీచ్‌లో సుమారు 5 గంటల సమయం వెచ్చించి ఈ శిల్పాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆయనతో వీడియోకాల్‌లో 5నిమిషాలు మాట్లాడి ఆయన సైకత శిల్పాన్ని చూపించానన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చట్టాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. న్యాయ సేవ భవన్‌లో సోమవారం న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. స్వగతి, స్వాతి స్వచ్ఛంద మహిళా సంస్థలు ప్రజలకు న్యాయ సేవాధికార సంస్థల గురించి తెలియజేస్తాయని అన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ కేవీ రమణ, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ శ్రీలక్ష్మి, స్వీప్ డైరెక్టర్ కొమ్ము రమణ మూర్తి పోలీస్ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రీసైక్లింగ్ మొక్కల సేకరణ



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కల నర్సరీ సిద్ధం చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం, హార్టికల్చర్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రీసైక్లింగ్ పద్ధతితో విద్యార్థులు సోమవారం మొక్కలను సేకరించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వృక్షాలకు చెందిన వేళ్లను సేకరించి వాటిని మళ్లీ రీసైక్లింగ్ చేసిన సీసాల్లో వేసి సిద్ధం చేశారు. సుమారు 200 మొక్కలను సిద్ధం చేశారు. వీటిని వివిధ ప్రాంతాల్లో నాటేందుకు అందుబాటులో ఉంచినట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ల్యూక్‌పాల్, వృక్షాస్త్రం, హార్టికల్చర్ విభాగం అధ్యాపకులు డి.వాసుబాబు, తేజతో పాటు ఎన్ఎస్ఎస్ పీఓ గొల్ల తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తోడేళ్లు



జేసీబీలతో రవాణాకు సిద్ధం చేసిన ఇసుక పోగులు

- పర్లాం కేంద్రంగా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ట్రాక్టర్లు రామకృష్ణాపురం, లారీలు పర్లాం మీదుగా తరలింపు
- తోటలలో జేసీబీలు ఉంచి రాత్రిపూట తవ్వకాలు



నదిలోకి వేసిన మార్గాలు, రవాణా ఆనవాళ్లు

జలుమూరు: పర్లాం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. జేసీబీ, ట్రాక్టర్లు రాత్రిపూట జీడిమామిడి తోటలో ఉంచి.. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత తవ్వుకుపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోయింది. వీరికి స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. రాత్రి పూట ఇటు అందవరం పంచాయతీ పరిధి రామకృష్ణాపురం మీదుగా నరసన్నపేట మండలం బోడవరం జంక్షన్, ముద్దాడపేట, గెడ్డవానిపేట, తెలగవలస, చెన్నాపురం గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తుండగా.. అటు పర్లాం గ్రామం నుంచి యాతపేట, మాకివలస, లింగంనాయుడుపేట, తిమడాం గ్రామాల నుంచి కొమనాపల్లి జంక్షన్ నుంచి జలుమూరు మీదుగా ఈ అక్రమ రవాణా టెక్కలి వరకూ సాగుతోంది. ఇంత బహిరంగంగా అక్రమ రవాణా జరుగుతున్నా అటు రెవెన్యూ గానీ ఇటు పోలీసులు గానీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల నుంచి రూ.8వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అదే లారీలు,భారత్ బెంజ్ వాహనాల్లో అయితే ఏకంగా రూ.50వేల వరకూ వసూలు చేస్తున్నారు.

నెట్‌వర్క్ ఇలా..

- రాత్రి ఎనిమిది గంటలు దాటిన తర్వాత తమ జేసీబీలను నదిలోకి దించుతారు.
- ఇందులో సుమారు 25 నుంచి 30 మంది వరకూ ఒక బృందంగా ఏర్పడి ప్రధాన జంక్షన్‌లో జోడవరం, తిమడాం, కొమనాపల్లి గ్రామాల వద్ద ఫుల్‌గా సిగ్నల్ వచ్చే మొబైల్స్ పట్టుకొని సిద్ధంగా ఉంటారు.
- అటు రెవెన్యూ, ఎస్ఈబీ, పోలీసు వాహనాలు రోడ్డు మీద కనబడితే చాలు వీరు ఆయా ఫోన్స్ ద్వారా నదిలో ఇసుకను లోడింగ్ చేస్తోన్న మరో బృందానికి సమాచారం చేరవేస్తారు.
- దాడి జరుగుతుందని ఏ మాత్రం అనుమానం వచ్చినా ఆయా వాహనాలను సుమారు అర గంటలోపల జీడిమామిడి తోటలోకి తీసువెళ్లి ఎవరికీ కనబడకుండా జాగ్రత్త పడతారు.
- వీరికి కావాల్సిన భోజనం, మద్యం తదితర ఏర్పాట్లు అన్నీ ఈ బృందం చూసుకుంటుంది.

అనుభవం ఉన్న వారే

గతంలో 2014–19 టీడీపీ అధికారంలో ఉండగా ఇసుక దందా చేసిన వారే మళ్లీ ఇప్పుడు ఈ వ్యవహారం అంతా చేయిస్తున్నారని పర్లాం, రామకృష్ణాపురం గ్రామస్తులు బహిరంగంగానే చెబుతున్నారు. ఏడెనిమిది గంటల్లో రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నారంటే ఎంత బరి తెగించి రెచ్చిపోతున్నారో అని మండల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ తిరుపతిరావును వివరణ కోరగా ఇప్పటికే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఆయా రెవెన్యూ సిబ్బందికి రాత్రి, పగలు విధులకు వేయడం జరిగిందన్నారు. రాత్రి పూట కూడా వాహనాలు వెళ్లకుండా ఆయా మార్గాల్లో ట్రెంచ్స్ తవ్వుతున్నామని చెప్పారు. తనిఖీలు ముమ్మరం చేసి వాహనాలు దొరికితే సీజ్ చేస్తామన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



క్వారీ నిర్వహిస్తున్న భూములు పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్, మైన్స్ అధికారులు

- వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు
- అడ్డుకున్న అధికారులు
- ఎనిమిది టిప్పర్లు, జేసీబీ స్వాధీనం



అక్రమ గ్రావెల్ తవ్వకానికి ఉపయోగిస్తున్న జేసీబీ, తరలింపునకు ఉపయోగిస్తున్న టిప్పర్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం పంచాయతీ నారాయణపురం రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 15–2, 3, 4 లో అక్రమంగా క్వారీయింగ్ నిర్వహిస్తూ అధికార పార్టీ మద్దతుదార్లు గ్రావెల్ తరలిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఈ తంతు జరుగుతోంది. ఈ విషయంపై ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా అధికారులకు సోమవారం సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ చిరంజీవి, మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావుతో కూడిన అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎనిమిది టిప్పర్లు, జేసీబీ స్వాధీనం చేసుకుని ఎచ్చెర్ల పోలీస్ స్టేషకు తరలించారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ డ్రైవర్లు, స్థానికంగా ఉన్న వారిని అధికారులు ప్రశ్నించారు. తమ వద్ద ఉన్న అనుమతులు అందజేయాలని సూచించారు. ఇవి అంధవరపు అప్పారావు కుటుంబ సభ్యులకు చెందిన జిరాయితీ భూములని, వారి అనుమతితో గ్రావెల్ తరలిస్తున్నట్లు చెప్పారు. జిరాయితీలో సైతం క్వారీయింగ్‌కు అనుమతులు ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎంపీపీ చిరంజీవి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దొంక అప్పలరాజు, మొదలవలస కృష్ణారావు, సత్తారు గోపీతో కూడిన బృందం సంఘటన స్థలానికి చేరుకొని అధికారులకు అక్రమ తరలింపు జరుగుతున్న తీరును వివరించారు. మండల పరిషత్ వరకు ఉన్న సిమ్మెంట్ రోడ్డు సైతం పాడవుతోందని తెలిపారు. టీడీపీ నాయకుడు ఈ అక్రమ క్వారీయింగ్ నిర్వహిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, అక్రమ క్వారీయింగ్ పై సమగ్ర విచారణ చేయాలని అధికారులను కోరారు.

కేంద్రానిది రైతు వ్యతిరేక బడ్జెట్



అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు అన్యాయం చేశారని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ కూడలి వద్ద కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయడానికి సిద్ధమవ్వగా పోలీసులు అడ్డుకోవడంలో పోలీసులకు, ప్రజా సంఘాలు నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు మోదీ ప్రభుత్వం మరోమారు అన్యాయం చేసిందని, పేద,మధ్య తరగతి ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్లకు దోచిపెట్టేలా బడ్జెట్ ఉందన్నారు. 2022–23లో కన్నా ఈ బడ్జెట్లో ఎరువుల సబ్సిడీలో 35 శాతం, ఆహార సబ్సిడీలో 25 శాతం, ఉపాధి హామీ చట్టం నిధుల్లో 20 శాతం కోత పెట్టిందన్నారు. బీహార్‌కు గ్రాంటు రూపంలో భారీగా నిధులిచ్చిన కేంద్రం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు సమకూర్చుతామని చెప్పడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈసారి కూడా కేటాయింపుల్లో తీరని ద్రోహం జరిగిందన్నారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చటానికి నిర్దిష్టమైన కేటాయింపులు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం కన్వీనర్ తాండ్ర ప్రకాశరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రమణ, పి.ప్రసాదరావు, ఎస్.ఎఫ్.ఐ నాయకులు డి.చందు, సంతోష్ కుమార్, కె.సూరయ్య, ఎం.గోవర్ధన్, ఎస్.కృష్ణవేణి, ఎస్.జగన్, డి.అప్పారావు, చిన్నప్పమ్మ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రేయింబవళ్లు కాపలా



కణితివూరు వంశధార కాలువపై కాపలాగా ఉన్న సీతాపురం రైతులు

వజ్రపుకొత్తూరు: సాగు నీటి కోసం రైతులు రేయింబవళ్లు కాలువ గట్లపై కాపలా కాస్తున్నారు. వంశధార శివారు గ్రామాలైన మండలంలోని బెండి, పెద్ద బొడ్డపాడు, సీతాపురం గ్రామాల రైతులు వంశధార నీటిని ఒడిసి పట్టి గ్రామంలోని ఎర్ర చెరువుకు తరలిస్తున్నారు. దీని కోసం గ్రామంలోని రైతులంతా రోజు 10 మంది చొప్పున షిఫ్టులు వేసుకుని రేయింబవళ్లు కాలువ వెంబడి కాపలా కాస్తున్నారు. ఎర్ర చెరువు నిండితే దాదాపు 250 ఎకరాల వరకు ఖరీఫ్ దమ్ములు పూర్తి చేసుకోగలమని రైతులు చెబుతున్నారు.

కణితివూరు వద్ద 60 ఆర్ఎల్ 9టీ కాలువ నుంచి సీతాపురం వరకు దాదాపు ఏడు కిలోమీటర్ల మేర ఎక్కడా ఎవరూ నీటిని వేరే ప్రాంతాలకు మళ్లించకుండా కాలువ వెంబడి తిరుగుతున్నారు. సోమవారం పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు ఆధ్వర్యంలో రైతులు కాలువ వద్ద కాపలా కాశారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన అలజంగి రాము

బూర్జ: మోటారు బైక్ అదుపు తప్పి పాలకొండ మండలం బుక్కూరు గ్రామానికి చెందిన అలజంగి రాము అనే వ్యక్తి సోమవారం గాయపడ్డాడు. ఆయన పాలకొండ వైపు నుంచి ఆమదాలవలస వైపు ప్రధాన రహదారిపై మధ్యాహ్నం వస్తుండగా బూర్జ మండలం డొంకలపర్త గ్రామం దగ్గరలో ప్రధాన రహదారిలో గోతులు తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో కుడికాలు విరిగిపోయింది. వెంటనే అతడిని స్థానికులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎల్‌సీడీసీ సర్వే బాధ్యతగా చేయాలి



కోమర్తిలో సర్వేని పరిశీలిస్తున్న తాడేల శ్రీకాంత్

నరసన్నపేట: జిల్లాలో ఎల్‌సీడీసీ సర్వే బాధ్యతగా చేపట్టాలని, సర్వే వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) తాడేల శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోమర్తి, సత్యవరంల్లో ఆయన సర్వే విధానాన్ని పరిశీలించారు. సర్వే వివరాలను సచివాలయ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్ సర్వేకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి కేసులను కొత్తగా గుర్తించడానికి ఈ నెల 18 నుంచి సర్వే ప్రారంభమైందని చెప్పారు. ఇప్పటి వరకూ 16 కొత్త కేసులు నమోదయ్యాయని, వీరికి ట్రీట్‌మెంట్ ప్రారంభించినట్లు తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను మొదట్లోనే గుర్తిస్తే తొందరగా వ్యాధి నయం చేయవచ్చని, అందులో భాగంగానే ఏటా సర్వే నిర్వహిస్తుంటామని చెప్పారు. ఆయన వెంట పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ హెల్త్ సూపర్‌వైజర్ రమణమూర్తి తదితరులు ఉన్నారు.

హ్యాక్ చేసి.. అమౌంట్ కాజేసి



బాధితుడు తెంబూరు సూర్యారావు



సైబర్ సెల్ ఫిర్యాదు కాపీ

శ్రీకాకుళం క్రైమ్ : కాసేపు ఫోన్ అడిగితే ఇచ్చిన పాపానికి రూ.1.54 లక్షలు కాజేశారని కోటబొమ్మాళికి చెందిన ఓ నాయీ బ్రాహ్మణుడు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డికి ఫిర్యాదు చేశాడు. కోటబొమ్మాళికి చెందిన తెంబూరు సూర్యారావు రెండేళ్ల కిందట ఖరగ్‌పూర్ ఐఐటీకి వెళ్లి అక్కడ కులవృత్తి చేసుకుంటున్నాడు. అతని బ్యాంకు ఖాతాలన్నీ కోటబొమ్మాళికి చెందినవే. ఖరగ్‌పూర్‌లోనే ఓ వ్యక్తి అర్జెంటుగా కాల్ చేయాల్సి ఉందని ఫోన్ అడిగితే ఇచ్చానని, అతను కాల్ చేసి మళ్లీ ఫోన్ ఇచ్చేశాడని, కానీ అక్కడకు కొద్ది రోజుల్లోనే ఈ నెల 19న ఉదయం 6:30 గంటలకు తన యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ. 1.50 లక్షలు, అక్కడికి పావుగంటలో మరో రూ.4 వేలు మాయమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే ఖరగ్‌పూర్ నుంచి వచ్చి కోటబొమ్మాళి లోకల్ బ్రాంచిని సంప్రదించగా యూనియన్ కేవైసీ అన్‌నోన్ యాప్ ద్వారా వాట్సాప్ నంబర్ తెలుసుకుని మహారాష్ట్ర ఐడీఎఫ్‌సీ బ్యాంకు చిరునామాతో ఉన్న వ్యక్తి హ్యాకింగ్‌కు పాల్పడినట్లు చెప్పారన్నారు. దీనిపై స్పందించిన ఎస్పీ యువకుడిని వెంటనే సైబర్‌సెల్‌కు పంపించి కోటబొమ్మాళి పోలీసులతో మాట్లాడారు. యువకునికి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

బినామీ ఉద్యోగి అనుచిత ప్రవర్తనపై

పోలీసుల విచారణ

పొందూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా బినామీ ఉద్యోగం చేస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులు విచారణ చేపట్టారు. దివ్యాంగుల కోటాలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన మహిళకు బదులు పాఠశాలలో బినామీ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ బినామీ ఉద్యోగి పాఠశాలలో కొంత మంది విద్యార్థినులకు ఫోను ద్వారా వాట్సాప్‌లో అసభ్య మెసేజ్‌లు పెడుతున్నాడు. ఈ విషయం పాఠశాల ఉపాధ్యాయులకు తెలియడంతో అతడిని మందలించారు. ఇదే విషయం ఇదివరకు పలువురు నాయకుల దృష్టికి కొంత మంది ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీసుకువెళ్లడంతో ప్రవర్తన మార్చుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ సంఘటనపై పాఠశాల నుంచి మహిళా ఉపాధ్యాయుల పేరుతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు వెళ్లింది. దీంతో విచారణ జరపాల్సిందిగా పొందూరు ఎస్ఐను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో పాఠశాలలో విచారణ చేపట్టారు.

కొద్ది నెలల క్రితం...

కొద్ది నెలల కిందట ఒక ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి గొడవ చేశారు. దీనిపై మిగిలిన ఉపాధ్యాయులు విద్యార్థినుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయారు. అయితే పాఠశాలలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పనుల్లో హెచ్ఎంకు బినామీ ఉద్యోగి అండగా నిలబడడం వల్లనే అతడిపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

దాతలే దయ చూపాలి

- రెండు కిడ్నీలూ పాడైపోయి ఇబ్బంది పడుతున్న యువకుడు
- కిడ్నీ ఇచ్చేందుకు ముందుకువచ్చిన తల్లి
- ఆపరేషన్‌కు రూ.లక్షల్లో ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్

హిరమండలం: మూడు పదుల వయసులోనే ఆయనకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. బిడ్డ ప్రాణాలు కాపాడేందుకు తల్లి తన కిడ్నీ ఇవ్వడానికి సైతం ముందుకువచ్చారు. కానీ ఆ ఆపరేషన్‌కు రూ.లక్షల్లో డబ్బులు ఖర్చవుతాయి. సొంత ఊరిలో బతకలేక వలస వెళ్లిన ఈ కుటుంబానికి ఆపరేషన్ చేయించే స్థోమత లేదు. దీంతో దాతల సాయం కోరుతున్నారు.

హిరమండలం మండలం పిండ్రువాడ గ్రామానికి చెందిన కింజరాపు శంకర్ (34) చిన్ననాటి నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి. ఈయన తండ్రి అనారోగ్యంతో చనిపోగా.. తల్లి, తమ్ముడుతో నివాసముండేవాడు. ఎనిమిదేళ్ల కిందట సాయిపద్మతో వివాహం జరిగింది. వీరికి మాన్విత, నందు అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో ఆకివీడు వెళ్లిపోయారు. అక్కడ శంకర్ పెయింటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే రెండేళ్ల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యులు పరీక్షించి కిడ్నీలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. రెండు కిడ్నీలకు ఇన్‌ఫెక్షన్ సోకినట్టు నిర్ధారించారు. దీంతో విజయవాడలోని సెంటినీ హస్పిటల్‌లో డయాలసిస్ జరుగుతోంది. కిడ్నీ మార్పిడి చేస్తే కానీ శంకర్ బతకడని వైద్యులు నిర్ధారించారు. తల్లి కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధపడినా.. ఆపరేషన్‌కు లక్షల రూపాయలు ఖర్చవుతుంది. ఇప్పటికే ఉన్న కొద్దిపాటి భూమిని విక్రయించి వైద్యం చేయించారు. అందిన దగ్గర అప్పులు కూడా చేశారు. ఇక తమ వద్ద ఏమీ లేదని.. రోజు వారీ జీవనానికి కూడా కష్టమవుతుందని భార్య సాయి పద్మ కన్నీటిపర్యంతమవుతూ చెబుతున్నారు.

దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఆ కుటుంబం కోరుతోంది. సాయం చేయదలచుకున్న వారు 9491100118 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసుకునేందుకు ఐటీఐలో పాస్ అయిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అప్రెంటిస్‌షిప్ దరఖాస్తు కోసం ఆగస్టు నెల 1వ తేదీ నుంచి అభ్యర్థులు వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరుతేదీ ఆగస్టు నెల 16 అని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ తదితర ట్రేడ్‌లకు సంబంధించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 27వ తేదీన నిర్వహించడం జరుగుతుందని, ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆ రోజు ఉదయం 10గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల, విటి అగ్రహారం, విజయనగరంలో హాజరుకావాలని తెలిపారు.

అన్నదాతకు అండగా నిలబడదాం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అన్నదాతలకు అండగా నిలబడదామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయం దాని అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, కో–ఆపరేటివ్, బ్యాంకర్లు తదితర శాఖల గురించి సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలసి సోమవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన తీసుకుంటున్న చర్యలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సారి జిల్లాలో 1,82,325 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఇందులో వరి 1,51,500 హెక్టార్లు, మొక్క జొన్న 10,000 హెక్టార్లు ప్రధానంగా సాగు చేయడం జరుగుతుందని, అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్ తెలిపారు. పి.ఎం. కిసాన్ కింద జిల్లాలో 2.29 లక్షల మంది రైతులకు రూ.45.8 కోట్లు నిధులు వారి వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.